క్లుప్తంగా


ఘనంగా బల్లల పండగ



పూజలు చేస్తున్న భక్తులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి సోమన్నపాలెంలో మంగళవారం బల్లల పండగ ఘనంగా నిర్వహించారు. శ్రీ కంచి కామాక్షి రజక సేవా సంఘం ఆధ్వర్యంలో పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నటుడు రవిప్రకాష్ సందడి



కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం భీమిలి బీచ్‌లో నటుడు రవిప్రకాష్ మంగళవారం సందడి చేశారు. భీమిలిలో గల తన స్నేహితుడిని కలిసేందుకు ఇక్కడకు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకూ తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో సుమారు 200 సినిమాల్లో నటించానని విలేకరులకు తెలిపారు. బీచ్‌లో అతనితో పలువురు పర్యాటకులు ఫొటోలు తీసుకున్నారు.

నేడు మండల సమావేశం

పద్మనాభం: పద్మనాభం మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు ఇన్‌ఛార్జి ఎంపీడీవో పి.రాధ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్టు ఆ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని ఆమె కోరారు.

గురుకుల ఉపాధ్యాయురాలికి సన్మానం



గురుకుల ఉపాధ్యాయురాలు మౌనిక దంపతులను సత్కరిస్తున్న డీసీవోలు, సిబ్బంది

మధురవాడ: గురుకుల ఉపాధ్యాయురాలు మేరీ మౌనిక సేవలు అద్వితీయమైనవని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల గురుకుల సమన్వయకర్తలు ఎస్.రూపావతి, చంద్రావతి, జి.గ్రేస్ తదితరులు కొనియాడారు. మధురవాడ రిక్షా కాలనీలోని ఏపీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల సీవోఈ ఉపాధ్యాయురాలు మౌనిక పదవీ విరమణ సన్మాన సభ మధురవాడలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకులంలో ఆమె అంకితభావంతో సేవలు అందించారని కొనియాడారు. అనంతరం మౌనిక దంపతులను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ నిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కన్నులపండువగా శ్రీవారి కల్యాణం



పూజలందుకున్న వేంకటేశ్వర స్వామి

పీఎం పాలెం: మిథిలాపురి వుడా కాలనీ బాలాజీ హిల్స్‌పై వెలసిన శ్రీ భూనీలా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ 15వ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 10 గంటలకు స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం గరుడ వాహన సేవ, తిరువీధి నిర్వహించారు. ఫిబ్రవరి 2న సాయంత్రంతో ఉత్సవాలు ముగుస్తాయని కమిటీ సభ్యులు తెలిపారు.

పనులన్నీ సత్వరమే పూర్తి చేయాలి

అధికారులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దిశా నిర్దేశం



ఆనందపురంలో అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంజూరు చేసిన నిధులతో చేపట్టిన పనులను సత్వరమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో అడపా లవరాజు ఆధ్వర్యంలో ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడున్నరేళ్లలో మండలంలోని వివిధ పంచాయతీల్లో రూ.200 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు పరిచామని చెప్పారు. ఇంకా గ్రామాల్లోని సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరించడానికి నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున మంజూరు చేశామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించి వాటితో చేపట్టిన పనులు మార్చిలోపు పూర్తి చేయాలని సూచించారు. అలాగే మండలంలోని రోడ్ల మరమ్మతులు, పునర్నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని చెప్పారు.

రైతుబజార్ల ఏర్పాటుతో మేలు

అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు మాట్లాడుతూ రైతు బజారులోని స్టాల్స్‌లో రైతుల నుంచి రూ.3 వేల వరకు అద్దె వసూలు చేస్తున్నారని, సమస్య పరిష్కరించాలని కోరారు. భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ మాట్లాడుతూ తగరపువలస, ఆనందపురం గ్రామాల్లో రైతు బజార్లు ఏర్పాటు చేస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. తహసీల్దార్ లోకవరపు రామారావు మాట్లాడుతూ ఎన్‌జీ ఆర్‌పురం, కణమాం రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పూర్తయ్యిందని, రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. మిగతా గ్రామాల్లో సర్వే డిసెంబర్ నాటికి పూర్తి అవుతుందని చెప్పారు. అనంతరం ఎంపీడీవో లవరాజు, ఈవోపీఆర్డీ ఆంజనేయులు, గృహ నిర్మాణ శాఖ ఏఈ లోక్‌నాథం మాట్లాడారు. వైస్ ఎంపీపీలు పాండ్రంకి శ్రీను, బొట్టా ధనలక్ష్మి, భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, కాకర్లపూడి వరహాలరాజు, పాండ్రంకి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పరిపాలన రాజధానితో ప్రయోజనం



భీమిలి మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: పరిపాలన రాజధానితో భీమిలి ప్రాంతానికి ఎంతో ప్రత్యేకత వస్తుందని, అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద మండల పరిషత్ అధ్యక్షుడు దంతులూరి వాసురాజు అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని ప్రాంతాల వారికి మేలు జరిగేలా అద్భుత పాలన అందిస్తున్నారని కొనియాడారు. వచ్చే ఎన్నికల్లోనూ ఆయన ఘన విజయం సాధించి మళ్లీ సీఎం అవుతారన్నారు. ఇప్పటి వరకు మండల పరిధిలో సుమారు రూ.300 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు పరిచామని పేర్కొన్నారు. ఉగాది నాటికి అర్హులందరికీ ఇళ్ల పట్టాలు అందజేయాలని, దీనిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కోరారు. అలాగే సకాలంలో ఇళ్లు కట్టుకోలేని వారి పట్టాలు ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయవద్దన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు లేవనెత్తిన సమస్యలకు సంబంధించిన పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

రాబోయేది వేసవి కాలం కావడంతో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా ఇప్పటి నుంచే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు విద్యుత్ లైన్లు, స్తంభాలు, రోడ్ల సమస్యలను లేవనెత్తడంతో... వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు యలమంచిలి సూర్యనారాయణ, ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ కె.వేణుగోపాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్‌పై ఆసక్తి పెంచుకోవాలి



విద్యార్థినులతో ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోపాలకృష్ణ తదితరులు

పద్మనాభం: ఫుట్‌బాల్ ఆటపై ఆసక్తి పెంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొసరాజు గోపాలకృష్ణ సూచించారు. జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ బి.శ్రీనివాసరావుతో కలిసి ఆయన పద్మనాభంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఫుట్‌బాల్ ఆటపై అవగాహన కల్పించారు. మూడు కస్తూర్బా విద్యాలయాల్లో ఫుట్‌బాల్ క్లబ్‌లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. జిల్లా, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో జీసీడీవో కాలేషా బేగం, స్పెషలాఫీసర్ గ్రేస్ లిల్లీ, సీఆర్టీలు పాల్గొన్నారు.

జాతీయ పక్షిగా గుర్తించి 60 ఏళ్లు



నెమలి రంగవల్లితో రాయపాలెం హైస్కూల్ విద్యార్థినులు

తగరపువలస: ప్రభుత్వం జాతీయ పక్షిగా నెమలిని గుర్తించి అరవై ఏళ్లు పూర్తయ్యాయని జీవీఎంసీ రాయపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధాకుమారి అన్నారు. మంగళవారం పాఠశాలలో ఆమె విద్యార్థులకు నెమలి గొప్పతనాన్ని వివరించారు. ఎన్నో ప్రత్యేకతలు కలిగిన నెమలి మన జాతీయపక్షి కావడం గర్వకారణమన్నారు. 1963 జనవరి 31న నెమలిని జాతీయపక్షిగా గుర్తించినట్టు తెలిపారు. వీటి ఈకలను శ్రీకృష్ణుడు అలంకారంగా, నెమలిని సుబ్రహ్మణ్యస్వామి వాహనంగా వినియోగించినట్టు పురాణాల ద్వారా తెలుస్తోందన్నారు. ఉపాధ్యాయురాలు శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే సంక్షేమ పాలన



నమ్మివానిపేటలో మహిళలకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: గత ప్రభుత్వాల హయాంలో ప్రజలకు సమస్యలు ఏమైనా ఉంటే అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవారని... వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అధికారులే ప్రజల ముంగిటకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అలాంటి వలంటీర్ వ్యవస్థను చంద్రబాబు హేళన చేశారని గుర్తు చేశారు. భీమిలి జోన్ రెండో వార్డు నమ్మివానిపేట వార్డు సచివాలయం పరిధిలో మంగళవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ పనితీరు, ప్రస్తుత ప్రభుత్వ పనితీరు గమనించాలన్నారు. గతంలో ఎన్నికల సమయంలోనే ఎమ్మెల్యే అభ్యర్థులు ఓటర్ల గడప తొక్కితే... ఇప్పుడు ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు గడప గడపకు వచ్చి సమస్యలు తెలుసుకుంటున్నారన్నారు. నమ్మివానిపేట సచివాలయం పరిధిలో రూ.6.66 కోట్లతో సంక్షేమ పథకాలు, రూ.1.69 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఈ సందర్భంగా శ్మశాన వాటికలకు వేర్వేరుగా ప్రహరీలు, నీరు, షెల్టర్లు, రహదారులు, గ్రామాల్లో డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు, తాగునీరు, రోజూ పారిశుధ్య పనులు, దోమల నిర్మూలన, సామాజిక భవనాలు కావాలని స్థానికులు కోరారు. వీటిపై ఎమ్మెల్యే స్పందిస్తూ వారం రోజుల్లో లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి రూ.4 లక్షలతో ట్రాన్స్‌ఫార్మర్, రూ.17 లక్షలతో శ్మశానవాటిక రహదారి, విద్యుత్ స్తంభాల మార్పు, ఏర్పాటు పూర్తి చేయనున్నట్టు హామీ ఇచ్చారు. అనిట్స్ కళాశాల యాజమాన్యం గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టేలా సూచిస్తామన్నారు.

మా ముఖ్యమంత్రి మంచోడు..

కోవిడ్ వంటి కష్టకాలంలో ఆర్థికంగా ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచోడని నమ్మివానిపేట, ఇడదాసరిపేట, ఉప్పాడపేట, పాసివారి కళ్లాలకు చెందిన ప్రజలు కొనియాడారు. సంక్షేమ పథకాల కొనసాగింపునకు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తిరిగి ఆయననే ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటామన్నారు. జెడ్పీ బి.రాము, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, కోఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, శిల్లా వంశీరెడ్డి, చిప్పాడ వెంకటేష్, కొప్పల రమేష్, కదిరి ఎల్లాజీ, చిల్ల సూర్యనారాయణరెడ్డి, జీరు సుజాత, నమ్మి మాధవ, సరగడ శివాంజనేయరెడ్డి, పీతల వెంకట అప్పారావు, మునకాల ఆదినారాయణ, గుండాసి మధు, భాగం స్వాతి సుధాకర్, చిల్ల ప్రమీల, గడిదీసు సూరిబాబు, శీరపు శ్రీరాములు, నమ్మి లక్ష్మణ, కంచుమాని వెంకటరావు పాల్గొన్నారు.


డీసీఎంఎస్ డైరెక్టర్‌గా 'పాండ్రంకి' పునర్నియామకం

ఆనందపురం : మండలంలోని లొడగలవానిపాలెం పంచాయతీ నేల్తేరు గ్రామానికి చెందిన పాండ్రంకి అప్పారావుని డీసీఎంఎస్ డైరెక్టర్‌గా పునర్నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. అలాగే ఆనందపురం సహకార సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా పాండ్రంకి అప్పారావుని పునర్నియమిస్తూ ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు పాల్గొన్నారు.


ఏఎస్ఎమ్ఈ విభాగం ప్రారంభం

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి అనుబంధంగా అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగు (ఏఎస్ఎమ్ఈ) విద్యార్థి విభాగం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దాదాపు 140 సంవత్సరాల చరిత్ర కలిగి 135 దేశాల్లో 85 వేలకు మంది పైగా సభ్యులున్న ఏఎస్ఎమ్ఈ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచడానికి విశేషంగా కృషి చేస్తుందన్నారు. గీతం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం పలు ప్రొఫెషనల్ క్లబ్‌లు ద్వారా విద్యార్థులకు వృత్తి పరమైన సాంకేతిక అంశాలపై అవగాహన పెంచేందుకు ప్రోత్సహిస్తుందని తెలిపారు.

స్కూల్ బస్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు



గాయాలపాలైన రాజా




రోడ్డుపై పడి ఉన్న క్షతగాత్రుడు

తగరపువలస: భీమిలి అప్పికొండవీధికి చెందిన అప్పికొండ రాజా (22) అనే యువకుడిని మంగళవారం ఉదయం గుర్తు తెలియని స్కూల్ బస్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. భీమిలి హెడ్ కానిస్టేబుల్ ఎం.వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం... మధురవాడ బజాజ్ క్రెడిట్ కార్డ్ కార్యాలయంలో పనిచేస్తున్న అప్పికొండ రాజా తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మన్యాలపేట కూడలి వద్ద ఎదురుగా వస్తున్న స్కూల్‌బస్ ముందు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలతోపాటు చెవుల నుంచి రక్తం వచ్చింది. ఢీకొట్టిన స్కూల్ బస్ ఆపకుండా వెళ్లిపోవడంతో దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

భీమిలి బ్యాంకు కాలనీ సమీపంలోని మహాలక్ష్మీపురం రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్ర వాహనంపై వస్తున్న ఆ వ్యక్తి సెల్ఫ్ యాక్సిడెంట్ కారణంగా ముఖం, తలపై తీవ్ర గాయాలున్నాయి. 108 సిబ్బంది చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. వివరాలు తెలియాల్సి ఉంది.

పొలంబడి క్షేత్రాలతో రైతుల్లో చైతన్యం



రబీ వరిసాగు పరిశీలిస్తున్న అధికారుల బృందం

ఆనందపురం : వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొలం బడి కార్యక్రమం వల్ల రైతుల్లో చైతన్యం వస్తోందని గుంటూరు వ్యవసాయ శాఖ కార్యాలయం సహాయ సంచాలకులు డి.లక్ష్మణబాబు అన్నారు. మండలంలోని బోనిలో పొలంబడి క్షేత్రాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి వచ్చని చెప్పారు. ఈ సందర్భంగా రైతులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి, ఏడీఏ సీహెచ్ సుబ్రహ్మణ్యం, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ విజయ ప్రసాద్, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్య నారాయణ, వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, వ్యవసాయాధికారి సంధ్యా రత్నప్రభ, సర్పంచ్ బోని అప్పలకొండ, బోని సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్లు పంపిణీ



బూట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు కళ్లాలకు చెందిన ఉండబట్ల సాధూరావు వర్ధంతి సందర్భంగా స్థానిక జెడ్పీ హైస్కూల్‌లోని 300 మంది విద్యార్థులకు రూ.80వేల విలువైన బూట్లు మంగళవారం పంపిణీ చేశారు. సాధూరావు కుమారులు వెంకట అప్పారావు, సూరిబాబు, నరసింగరావు, చిన్నారావు వీటిని వైఎస్సార్ సీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు చేతుల మీదుగా అందించారు. భీమిలి జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, బీఆర్బీ నాయుడు, మాజీ సర్పంచ్ మద్దిల వెంకటరమణ, నాయకులు గుడ్డాల ఎల్లయ్య, గాడు తాతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

● భీమిలి మండలం తాటితూరు పంచాయతీకి చెందిన విద్యార్థిని ఉండబట్ల అర్చన తోటి విద్యార్థులకు ఆదర్శం కావాలని ముత్తంశెట్టి మహేష్ అన్నారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో 590 మార్కులు సాధించిన ఆమెను పంచాయితీ తరఫున అభినందించారు. అర్చన తల్లిదండ్రులు నరసింగరావు, తిరుమల పాల్గొన్నారు.

జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణానికి చర్యలు

జోన్ - 2 కమిషనర్ కనక మహాలక్ష్మి



మధురవాడలో లబ్ధిదారు వాటా పత్రాలు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 పరిధిలోని జగనన్న కాలనీ ఇళ్ల సత్వర నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్టు జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి చెప్పారు. ఇళ్ల నిర్మాణం, లబ్ధిదారుల బాధ్యత, నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై పలు ప్రాంతాల్లో స్థలాలు పొందిన వారికి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాల్లో భాగంగా ఇప్పటికే అర్హులందరికీ స్థలాలు కేటాయించామని చెప్పారు. స్థలాలు పొందిన వారు హౌసింగ్ స్కీం ద్వారా ఇళ్లు కట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటి వరకు జోన్‌లోని 9 వార్డుల్లో 13,427మంది లబ్ధిదారులు ఉండగా వీరిలో 7,369 మంది ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లో ఉన్నారని తెలిపారు. వీరిలో 6,057మందికి సిబ్బంది లోన్ ప్రక్రియ పూర్తి చేయగా 2,258 మందికి రుణాలు మంజూరు కావడం, లబ్ధిదారుని వాటా జమ చేయడం జరిగిందన్నారు. 3వ ఆప్షన్ ఎంచుకున్న వారికి స్కీం ద్వారా రూ.1.8లక్షలు కాంట్రాక్టర్‌కు చెల్లిస్తామని, లబ్ధిదారుని వాటా కింద రూ.35 వేలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఎస్‌హెచ్‌జీలో లేని వారిని గ్రూపుల్లో చేర్పించి లోన్స్ ఇప్పించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ గంగాధర్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో వెల్లంకి విద్యార్థుల ప్రతిభ



పోటీల విజేతలతో ఉపాధ్యాయులు

ఆనందపురం : మండలంలోని వెల్లంకి ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాకర సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థులను సత్కరించారు. జనవరి 28 నుంచి 30 వరకు ప్రకాశం జిల్లా దొనకొండలో జరిగిన 66వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్న పదో తరగతి విద్యార్థి చెల్లుబోయిన రవి మొదటి స్థానంలో నిలిచాడు. మాదాబత్తుల దుర్గా భవానీ, మాదాబత్తుల భవానీ రన్నర్స్‌గా నిలిచారు. అనంతపురం జిల్లా కదిరిలో ఇటీవల జరిగిన అండర్ – 14 హ్యాండ్‌బాల్ పోటీల్లో తాతపూడి కుసుమ విజేతగా నిలిచింది. ఈ మేరకు వారిని సత్కరించిన కాకర సురేష్ మాట్లాడుతూ యువ క్రీడాకారులను ప్రోత్సహించడానికి రవాణా చార్జీలు, ఇతరత్రా సాయం అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యయులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్

పద్మనాభం: పలుచోట్ల దొంగతనాలకు పాల్పడిన ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు పీఎం పాలెం క్రైం సీఐ రమేష్ తెలిపారు. సీఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. పద్మనాభం మండలం ఐనాడ పంచాయతీ సత్యనారాయణపురంలో రిటైర్డు ఏపీఎస్‌పీ ఏఎస్‌ఐ ఇంటిలో, మరో ఇంటిలో ఇదే మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రెడ్డిపల్లి నరేష్ (39) బంగారం దొంగలించాడు. ఈ కేసులో నరేష్ నుంచి తులం బంగారం, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకుని తునివలసలో సోమవారం అరెస్టు చేశారు. నరేష్‌ను మంగళవారం భీమునిపట్నం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు.

పబ్లిక్ డిమాండ్

లక్ష్మివానిపాలెంలో పందుల బెడద



లక్ష్మివానిపాలెంలో నివాసాల మధ్య సంచరిస్తున్న పందులు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ పీఎంపాలెం – లక్ష్మివానిపాలెం గ్రామస్తులు పందులతో నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నివాసాల మధ్య, రోడ్లపై పదుల సంఖ్యలో పందులు తిష్టవేసి రాకపోకలు సాగించే వారిపై దాడులు చేస్తున్నాయి. అంతేకాకుండా వ్యాధులను వ్యాప్తి చేస్తున్నాయి. ఇప్పటికే పలు మార్లు లక్ష్మివానిపాలెం సచివాలయం, మధురవాడ జోన్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి పందులను నియంత్రించాలి.

– యేసు రాజు, పీఎం పాలెం.

గతుకుల రహదారితో ఇబ్బందులు



శ్రీవల్లీనగర్‌లో గతుకులమయమైన సీసీ రోడ్డు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ శ్రీవల్లీనగర్‌లోని యూనియన్ బ్యాంకు సమీపంలో సీసీ రోడ్లు గతుకులమయం కావడంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నడవడానికి కూడా ఇబ్బందిగా ఉండేంతగా గోతులు ఏర్పడ్డాయి. వీటికి మరమ్మతులు చేయాలని పలుమార్లు మధురవాడ జోన్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

– డాక్టర్ ఎస్.రామచంద్రరావు, మధురవాడ